భగీరథ లీకేజీతో తప్పని తిప్పలు

పగిలిపోయిన పైపులైన్, లీకేజవుతున్న నీరు

తాండూరు, మే 5: తాండూరు పట్టణం చించొల్లి రోడ్డు మార్గంలో మిషన్ భగీరథ నీళ్ల పైపు రోడ్డు పనులు చేస్తుండగా విరిగి పోయింది. వెంటనే బాగు చేయాల్సిన అధికారులు నీళ్లు వచ్చిన సమయంలో రోడ్డుపై ఏరులుగా పారినా పట్టించుకోక పోవడంతో స్థానిక కాలనీల ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. సగం పగిలిన పైపులో నుంచి రోడ్డు పై ఉన్న మురుగు నీరు పోవడంతో మంచి నీళ్లు పట్టుకున్న ప్రజలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి మిషన్ భగీరథ నీళ్ల పైపులను బాగు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పాము కాటుకు
బాలుడు మృతి

దోమ, మే 5: పాము కాటుకు బాలుడు మృతి చెందిన ఘటన దోమ మండల పరిధిలోని బాసుపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బాసుపల్లి గ్రామానికి చెందిన చాకలి రాములు, సువర్ణలకు ముగ్గురు కూతుర్లు ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు చాకలి శివకుమార్(11) పరిగి పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాలలో 6వ తరగతి చదివి ఇటీవలే సెలవులపై ఇంటికి వచ్చాడు.ఈ క్రమంలో తాత చాకలి పెద్ద నర్సయ్యతో కలిసి ఉదయం పది గంటల సమయంలో పొలానికి వెళ్ళాడు. పొలంలోని మామిడి చెట్టుకు మామిడి కాయలు తెంపేందుకు వెళ్ళగా నాగుపాము బాలుని కాలుపై మూడు సార్లు కాటు వేసింది. గమనించిన బాలుడు కుటుంబ సభ్యులకు తెలిపాడు. కుటుంబ సభ్యులు దొంగెన్కెపల్లి గ్రామంలో మంత్రతంత్రాలకు బాగవుతుందని అక్కడికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో బాలున్ని వెంటనే పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని
గేదెల కాపరి మృతి

పెద్దేముల్, మే 5: మండల కేంద్రంలో టిప్పర్ లారీ ఢీకొని పెద్దేముల్ గ్రామానికి చెందిన బుర్నపురి రవి (41) మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దేముల్ గ్రామానికి చెందిన బుర్నపురి రవి (41) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బాలేసాబ్ అనే వ్యక్తి దగ్గర గేదేల కాపరిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం ఉదయం 10 గంటల సమయంలో గేదేలను మేత మేపుటకు గ్రామంలోని పెద్ద చెరువు దగ్గరికి తొలుకెళ్లాడు. కాగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో పెద్ద చెరువు పానాదిలో పెద్దేముల్ గ్రామానికి చెందిన ముక్రమ్ ఖాన్‌కు చెందిన టిప్పర్ లారీ డ్రైవర్ అతి వేగంగా అజాగ్రత్తగా నడిపి, రవిని ఢీకొట్టింది. రవి రెండు తోడల భాగాలపై టిప్పర్ వెళ్లింది. దీంతో తీవ్రగాయాలైన రవిని తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాగా డాక్టర్ పరీక్షించి రవి మృతి చెందాడని నిర్ధారించాడు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రవి అన్న ఎల్లప్ప తన తమ్ముడి మరణానికి కారణమైన టిప్పర్ యజమాని, డ్రైవర్ పై చర్యలు తీసుకోని తమకు తగిన న్యాయం చేయాలని పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎల్లప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దేముల్ ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపాడు.

గొంతెండిపోతున్నది..

• పాషాపూర్‌లో నీటి ఎద్దడి • పట్టించుకోని పాలకులు, అధికారులు • ఇచ్చిన హామీలు అంతేనా?

బొక్కెనలతో నీటిని తోడుతున్న గ్రామస్తులు తోపుడు బండిపై తీసుకెళ్తున్న పిల్లలు వ్యవసాయ క్షేత్రాల నుంచి ఇలా.

పెద్దేముల్, మే 5 : పెద్దేముల్ మండల పరిధిలోని పాషాపూర్‌లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలో రెండు వేల జనాభా ఉంది. సరిపడా నీటి వనరులు మాత్రం లేవు. ఎన్నికల ముందు పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మా గ్రామానికి రెండు బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. అదే విషయమై ఏడాది కాలంగా ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమీక్షా సమావేశాల్లో నియోజకవర్గంలో ఎక్కడ నీటి ఎద్దడి రాకుండా చూడాలని అధికారులను ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదంటున్నారు. నిధులు లేకుండా మేం ఏమి చేయగలమని స్థానిక అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ బోర్ల మీద ఆధారపడి ఎన్నిరోజులు నీటి కష్టాలు పడాలని ఆవేదన చెందుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి

పాషాపూర్‌లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలి. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారు. నీటి సమస్యను మాత్రం పరిష్కరించడం లేదు. ఎన్నికల ముందు బోర్లు వేయిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి చర్యలు తీసుకోవాలి. –అనిల్, పాషాపూర్, పెద్దేముల్ మండలం

నిర్వహణ సరిగా లేదు

ప్రస్తుతం మిషన్ భగీరథ నీటి నిర్వహణ సరిగా లేదు. గ్రామంలో నీటి ఎద్దడి నెలకొంది. మా తండాలను అధికారులు, నాయకులు చులకనగా చూస్తున్నారు. ఎన్నికల సమయంలో వచ్చిన నేతలు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ సమస్యను పరిష్కరించని పక్షంలో గ్రామస్తులందరం కలిసి ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తాం. – రాములు నాయక్, పాషాపూర్ తండా, పెద్దేముల్

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం సీసీ రోడ్డు తొలగింపు

పరిగి, మే 5 : ఏదైనా అభివృద్ధి పని చేస్తే ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి తప్ప ఇబ్బంది కలగకూడదు. చేసే పనులు నిర్మాణాత్మకంగా, ప్రణాళికాబద్ధంగా ఉంటే అన్నీ సజావుగా ఉంటాయి. కానీ ముందు చేయాల్సిన పని తర్వాత, తర్వాత చేయాల్సిన పని ముందు చేయడం వల్ల చేపట్టిన పనులు సైతం ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే పరిగి మున్సిపాలిటీ పరిధిలోని న్యామత్‌నగర్‌లో గత రెండేళ్ల క్రితం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో తమకు రోడ్డు సదుపాయం చక్కగా మారిందని అందరూ సంతోషించారు. అంతా బాగుందనుకున్న తరుణంలో గత మూడు నెలల క్రితం రూ. 6లక్షలు వెచ్చించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం ఆలోచన మంచిదే అయినప్పటికీ ఉన్న సీసీ రోడ్డును తొలగించి మరీ ఈ డ్రైనేజీ నిర్మించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం తర్వాత కొద్ది రోజులకు సంబంధిత స్థలంలో మళ్లీ సీసీ వేసి మూసివేస్తే ప్రజలకు రోడ్డు ఉపయోగంగా ఉంటుంది. కానీ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం తర్వాత కేవలం మట్టితో పూడ్చివేసి అలాగే వదిలివేయడంతో సీసీ రోడ్డు పక్కన మట్టి రోడ్డుగా మారింది. ఇండ్ల లోపలికి వెళ్లే దగ్గర గుంతలుగా మారిందని వాపోతున్నారు. మరోవైపు వర్షాలు కురిస్తే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైన గల మట్టి కుంగిపోయి కాలువలా మారుతుందని, మళ్లీ బురదతో ఇబ్బందులు ఏర్పడతాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పై భాగంలో సీసీ వేయించాలని తద్వారా రోడ్డును రవాణాకు అనుకూలంగా మార్చాలని కోరుతున్నారు.

వికారాబాద్, మే 5 : తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, పార్టీ నాయకులు ఆమెను కలిసి సన్మానించి, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు వికారాబాద్ నియోజకవర్గ సీనియర్ నాయకులు మల్లేశం, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుభాన్‌రెడ్డి, పట్టణ జనరల్ సెక్రటరీ గాండ్ల మల్లికార్జున్, టౌన్ యూత్ ప్రెసిడెంట్ గిరీష్ కొఠారి, వికారాబాద్ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు అశోక్, మండల మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ గయాజ్ , యువ నాయకులు షఫీ, జైపాల్ రెడ్డి, నరసింహ, సంతోష్ కొఠారి ఉన్నారు.

పరిగి, మే 5 : పరిగి పట్టణం మీదుగా సోమవారం భారీ యంత్రాన్ని మరో భారీ వాహనం ద్వారా తరలించారు. ఈ వాహనం మహారాష్ట్రలోని పూణె నుంచి తమిళనాడులోని కాంచీపురం వెళ్తున్నట్లు వాహనం వారు తెలిపారు. పూణె నుంచి బయలుదేరిన వాహనం సోమవారం పరిగికి చేరుకుంది. ఇక్కడి నుంచి కాంచీపురం వెళ్లడానికి మరో రెండు నెలల సమయం పట్టవచ్చని వారు పేర్కొన్నారు. ఈ భారీ యంత్రాన్ని 64 హైడ్రాలిక్ టైర్లు గల భారీ వాహనంపై తరలించారు. ఈ యంత్రం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పరీక్షించే యంత్రంగా తెలిపారు. ఏది ఏమైనా భారీ వాహనంలో భారీ యంత్రం తరలించడం ఆసక్తిగా గమనించారు. ఈ వాహనం వెళ్లడానికి అడ్డుగా ఉన్న వాటిని తొలగించి మరీ నిదానంగా వాహనం తరలించారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

దోమ, మే 5 : మండల పరిధిలోని 36 గ్రామ పంచాయతీలలో రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించడంతో పాటుగా పని ప్రదేశంలో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతూ దోమ మండల ఎంపీడీవో గ్యామనాయక్‌కు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన రేటు 307 రూ..లు ఉంటే కోలతల పేరుతో వేతనాలలో కోత విధించి వంద నుంచి నూటాయాభై రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నట్లు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.కొలతలతో సంబంధం లేకుండా 307 రూ..లు ఇవ్వాలని వారు కోరారు. కూలీలకు వంద రోజుల పనిదినాల స్థానంలో రెండు వందల పని దినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీవో రాజేశ్ కార్మిక సంఘం అధ్యక్షుడు హెచ్ సత్యయ్య, నాయకులు మొగులయ్య, శేఖర్, సత్యయ్య, మొగులయ్య పాల్గొన్నారు.

జడ్జి గిరిజా ప్రియదర్శిని మృతికి సంతాపం

వికారాబాద్, మే 5 : తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి గిరిజా ప్రియదర్శిని మృతి చెందడంతో వికారాబాద్ బార్ న్యాయవాదులు వికారాబాద్ కోర్టు బార్ ఆధ్వర్యంలో సోమవారం మౌనం పాటించి సంతాపం తెలిపారు. జస్టిస్ గిరిజా ప్రియదర్శిని గతంలో వికారాబాద్ జిల్లా కోర్టుకి పోర్ట్ పోలియోగా కూడా పనిచేశారని, జిల్లాకోర్టు కి ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్ రెడ్డి , జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శాంతిలత, బార్ ప్రెసిడెంట్ బస్వరాజ్ పటేల్, ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి , వైస్ ప్రెసిడెంట్ శంకరయ్య, బార్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కోర్టు కేసులో ఉన్న భూమిని కౌలుకు ఇవ్వడం సరికాదు

వికారాబాద్, మే 5 : కోర్టు కేసులో ఉన్న భూమిని దేవాదాయ శాఖ వారు కౌలుకు ఇవ్వడం సరికాదని కెరెళ్లి గ్రామానికి చెందిన రైతు హన్మయ్య సోమవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ధారూరు మండలం కెరెళ్లి గ్రామానికి చెందిన హన్మయ్యకు చెందిన సర్వే నెంబర్ 59లో 4.20ఎకరాల భూమి ఉంది. మా తాతల కాలం నుంచి భూమిలో సాగు చేసుకుంటున్నాం. ఈ భూమి వికారాబాద్ శ్రీ అనంతపద్మనాభస్వామి దేవాలయానికి చెందిన భూమి అని, గతంలో హై కోర్టులో కేసు వేశారు. కోర్టులో కేసు నడుస్తుండగా ఇటీవల దేవాలయ శాఖ అధికారులు ఈ భూమిని కౌలుకు వేలం వేశారని రైతు పేర్కొన్నారు. కోర్టు కేసు ఉన్న భూమిని కౌలుకు ఇవ్వకూడదని కోరారు. వెంటనే ఈ సర్వే నెంబర్‌లో వేసిన కౌలును రద్దు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు

కేజీబీవీలో అడ్మిషన్లు ప్రారంభం

దోమ, మే 5 : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి నూతన అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఎంఈవో వెంకట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో సీఈసి గ్రూపులో 40, ఎంహెచ్‌డబ్ల్యూలో 40 సీట్లు ఉన్నాయని ఆసక్తి కలిగిన బడుగు,బలహీన వర్గాల బాలికల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.దీనికి గాను విద్యార్థుల పదవ తరగతి మెమో,ఆధార్ కార్డు,కుల దృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో పాటుగా రెండు ఫొటోలను పాఠశాల ఎస్‌వో చైతన్యకు అందజేసి అడ్మిషన్ పొందవచ్చని ఎంఈవో పేర్కొన్నారు.

కులగణనపై కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మే 5: జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తరపున స్వాగతిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం పరిగిలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టడంలో తెలంగాణ ప్రభుత్వం, రాహుల్‌గాంధీ ఆలోచన విధానానికి నిదర్శనమని చెప్పారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్‌లు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని, ఈ హామీ మేరకు తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కులగణన చేపట్టి, బీసీ రిజర్వేషన్‌లు 42శాతం పెంచే బిల్లుకు ఆమోదం తెలిపి కేంద్రానికి పంపించామన్నారు. అణగారిన అన్ని వర్గాలకు న్యాయం చేకూరే విధంగా కులగణన చేపట్టాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మైనారిటీలలో ఉన్నటువంటి వెనుకబడిన వర్గాలను బీసీలుగా గుర్తించాలన్నారు. ఈనెల 7వ తేదీన వికారాబాద్‌లో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేతులమీదుగా జరిగే అంబేద్కర్ విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. మధ్యాహ్నం 3 గంటలకు వికారాబాద్‌లోని సత్యభారతి ఫంక్షన్‌హాల్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశం జరుగుతుందని, జిల్లా సమావేశం తర్వాత అసెంబ్లీ, మండల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాక్ ఎ అధ్యక్షుడు పార్థసారథి, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

తాండూరు, మే 5: తాండూరు పట్టణం, తాండూరు మండల పరిధిలోని 143 మంది లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రూ.1,43,16,588 విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందించాల్సిన పథకాలను నిష్పక్ష పాతంగా అందిస్తామన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజల అభివృద్ధే ధ్యేయంగా నడుచుకుంటామని తెలిపారు.

క్షయవ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సు ద్వారా సీవైటీబీ ఇంజక్షన్ ఇప్పిస్తున్న టీబీ హెల్త్‌విజిటర్ రాజూనాయక్

కులకచర్ల, మే 5 : క్షయవ్యాధితో అప్రమత్తంగా ఉండాలని టీబీ హెల్త్‌విజిటర్ రాజూనాయక్ అన్నారు. సోమవారం కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు వైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సీవైటీబీ ఇప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి అత్యంత ప్రమాదకరమైనదని, వ్యాధి కుటుంబంలో ఒకరికి సోకినా ఇతరులపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. క్షయవ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు క్షయపరీక్షలు చేయించుకోవడంతో పాటు సీవైటీబీ ఇంజక్షన్‌ను తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంజక్షన్ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 10 మంది టీబీ వ్యాధిగ్రస్తుల కుటుంబసభ్యులకు ఇంజక్షన్‌ను ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ ఫాతిమా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత

బషీరాబాద్, మే 5 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వ్యక్తులు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న, చోరీకి గురైన బాధితులు బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ మ్యాప్‌ను ఉపయోగించి సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎస్సై శంకర్ సోమవారం బాధితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్టీ లెవల్ మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

యాలాల, మే 5: మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎమ్ఎల్ఎమ్)ల ద్వారా కోటీశ్వరులను చేస్తామని మధ్య తరగతి కుటుంబాలే టార్గెట్‌గా మోసగాళ్లు మోసానికి పాల్పడుతుంటారని ఎస్‌హెచ్‌ఓ గిరి అన్నారు. సోమవారం మల్టీ లెవల్ మార్కెటింగ్, సైబర్ నేరాలపై ఆయన ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. కరోనా సమయం నుంచి ఈ మల్టీ లెవల్ మార్కెటింగ్ కంపెనీల కార్యకలాపాలు పెరిగిపోయాయన్నారు. వాట్సప్ మెసేజ్‌లు, జూమ్ మీటింగ్స్ ద్వారా తక్కువ సమయంలో చిన్న పెట్టుబడులతో రూ. కోట్ల సంపాదన పొందవచ్చంటూ బురిడీ కొట్టిస్తున్నాయన్నారు. మల్టీ లెవల్ మార్కెటింగ్ కంపనీలు రూ.10 వేల నుంచి రూ.15000 చెల్లించి చేరితే బోలెడు లాభాలు పొందవచ్చని, టార్గెట్ రీచ్ అవుతూ వెళ్తే టీవీలు, కార్లు, ఫారెన్ ట్రిప్పులంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారన్నారు. దీంతో మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పలువురు మోసపోతున్నారన్నారు.

ఫ్రాంఛైజ్ దరఖాస్తు పేరుతో
3.3 లక్షలు దోపిడీ

సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): కొరియర్ ఫ్రాంఛైజ్ కోసం ఇంటర్‌నెట్‌లో శోధించిన ఓ యువతిని సైబర్‌నేరగాళ్లు ఆన్‌లైన్‌లో నిండా దోచుకున్నారు. 3.3 లక్షలు వసూలు చేసుకున్నారు. మల్కాజిగిరికి చెందిన బాధితురాలు ఓ కంపెనీలో కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నది. కొరియర్ ఫ్రాంఛైజ్ తీసుకోవాలనే ఉద్దేశంతో ఇంటర్‌నెట్‌లో వెతికింది. డెలివరీ.కామ్ అనే వెబ్‌సైట్‌లో వివిధ సంస్థల ఫ్రాంఛైజ్ ఇస్తున్నారనే సమాచారం తెలుసుకుంది. ఆ వెబ్‌సైట్‌లోకి వెళ్లి కొరియర్ డెలివరీ సర్వీస్ ఫ్రాంఛైజ్ కోసం దరఖాస్తు చేసింది. బాధితురాలి దరఖాస్తును చూసి.. పంకజ్‌కుమార్ అనే పేరుతో తాను రిలేషన్ మేనేజర్‌నంటూ ఒక వ్యక్తి ఫోన్ చేశాడు. ధ్రువపత్రాలు పరిశీలిస్తున్నామని.. తొలుత ఫీజుగా చెబుతూ రూ. 22600 వసూలు చేశారు. అవన్నీ తర్వాత వెనక్కి తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికారు. ఆ తరువాత లైసెన్స్ ఫీజు, ఎన్ఓసీల పేరుతో రూ. 3.30 లక్షలు వసూలు చేశారు. సదరు యువతి..ఇక నేరుగా కార్యాలయానికి వస్తానని చెప్పడంతో సైబర్ దొంగలు ఢిల్లీ గురుగ్రాం చిరునామా చెప్పి ఫోన్ స్విచాఫ్ చేశారు. దీంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితురాలు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఏపీకే ఫైల్ క్లిక్ చేశాడు..
లక్ష పోగొట్టుకున్నాడు

సిటీబ్యూరో, మే5(నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు పంపిన ఏపీకే ఫైల్స్‌ను క్లిక్ చేసి ఓ వృద్ధుడు లక్షా 18 వేలు పోగొట్టుకున్నాడు. నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి కొరియర్‌లో ఓ పార్సిల్ రావలసి ఉంది. ఇటీవల తన చిరునామా మారడంతో పార్సిల్ మిస్ అవుతుందేమోనని అడ్రస్ మార్పు సమాచారం అందించడం గురించి ఆన్‌లైన్‌లో కొరియర్ సర్వీస్ ప్రతినిధులను సంప్రదించే ప్రయత్నం చేశాడు. కస్టమర్ సర్వీస్ నెంబర్ కోసం వెతికి ఆ నెంబర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. కొద్ది సేపటి తర్వాత రిటర్న్ కాల్ వచ్చింది. తాము కస్టమర్ కేర్ ప్రతినిధిగా పరిచయం చేసుకుని అడ్రస్ మార్పు ప్రాసెస్ చేయాలంటే నిబంధనల ప్రకారం కొద్దిగా రుసుం చెల్లించాల్సి ఉంటుందని, తాము పంపిన లింక్ ఓపెన్ చేసి రూ.1 చెల్లించాలని చెప్పారు. దీంతో బాధితుడు క్రిమినల్స్ పంపిన ఏపికె ఫైల్స్ లింకును ఓపెన్ చేసి రూ.1 పంపించాడు. వెంటనే బాధితుడి ఫోన్ రెండుసార్లు స్విచాఫ్ అయి ఆన్ అయింది. ఆ తర్వాత బ్యాంక్ ఖాతా చెక్ చేసుకోగా, రూ.1.18లక్షలు డెబిట్ అయినట్లు గుర్తించాడు. తాను మోసపోయానని గ్రహించి, సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఐదుగురికి కొత్త జీవితం

ఖైరతాబాద్, మే 5 : తాను మరణిస్తూ పలువురికి అవయవదానం చేసి కొత్త జీవితాన్ని అందించాడో యువకుడు. జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.... నల్గొండ జిల్లా కాంచనపల్లెకు చెందిన కొప్పులు సంపత్ కుమార్ (20) పెయింటర్. ఈ నెల 1న ఆటోలో వెళ్తుండగా, అదుపుతప్పి కిందపడిపోయాడు. ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 4న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబసభ్యుల అంగీకారం మేరకు సంపత్ శరీరం నుంచి కాలేయం, రెండు కార్నియాలు, మూత్రపిండాలను సేకరించినట్లు వైద్యులు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

ఉప్పల్, మే 5: సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన తుమాటి గోపికృష్ణారెడ్డి (27) అన్నోజిగూడలోని ప్రేమలత అపార్ట్‌మెంట్‌లో నివాసముంటూ ప్రైవేట్ హాస్టల్ నిర్వహిస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున 1.40 గంటలకు బైక్‌పై చైతన్యపురి నుంచి అన్నోజిగూడకు వస్తూ నాగోల్ మెట్రో స్టేషన్ పిల్లర్ నంబర్ 819 వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా ఉప్పల్ నుంచి నాగోల్ వెళ్తున్న లారీ వాహనదారుడు గోపీకృష్ణను ఢీ కొట్టింది. అతడు కిందపడిపోగా 10మీటర్ల దూరం ఈడ్చుకొని వెళ్లగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సం